కథ

# సీనియర్ సిటిజన్

మార్చినెల కావడంతో కంపెనీ పని ఒత్తిడిలో బాగా పొద్దుపోయి, రాత్రి తొమ్మిదింటికి ఇల్లు చేరాడు సారథి.

''తింటే తినండి- లేకపోతే మానేయండి! ఎవర్నీ బ్రతిమిలాడే ఓపిక నాకు లేదు!'' వంటింట్లోంచి ఖంగుమని వినిపిస్తోంది భార్య భానుమతి గొంతు.

చెప్పులు తలుపు పక్కన వదలి, లోపలి గదిలోకి వెళ్ళి పాంట్ విడిచి లుంగీ చుట్టబెట్టుకున్నాడు సారథి. భార్యకు గానీ, పిల్లలకిగానీ తను వచ్చినట్లే తెలియదు! భర్త ఇల్లు చేరేదాకా వీధిలో లైటు వెలుగుతూండాలని వీధి తలుపు మూసి గడియ పెట్టకూడదని భానుమతి మూఢవిశ్వాసం.

''ఎప్పుడు తాతయ్యకి, అక్కకి ఇష్టమైన కూరలే చేస్తావు. బెండకాయ వేపుడు చేయొచ్చుగా!'' చిన్నకూతురు పదేళ్ళ రమ సాధింపు.

''సండేనాడు బెండకాయకూరేగా చేసింది! వంకాయ చేసి వనవీక్ దాటింది తెలుసా?'' ఏడోక్లాసులోకి వచ్చిన పెద్ద కూతురు రజనీ.

''అబ్బబ్బ! కాస్సేపు నోరుమూసుకుని భోంచేస్తారా?'' కస్సుమంది భానుమతి.

''నోరు మూసుకుని భోజనం ఎలా చేయాలి మమ్మీ? కిసుక్కున నవ్వింది రమ.

''చదువులో చూపించు ఈ తెలివి!'' కూతురు వేళాకోళానికి కోపగించుకుంది భానుమతి.

ఎందుకో ఈరోజు పూర్తిగా మూడ్ ఆఫ్‌లో వున్నట్లుంది!

సారథి కాళ్ళు కడుక్కోడానికి బాత్‌రూమ్‌లోకి వెళుతూంటే భానుమతి భర్తను చూసి, క్షణంలో చూపు తిప్పేసుకుంది ''ఆలస్యం అయిందేమిటండీ!'' అంటూ భర్త ఏడింటికి ఇల్లు చేరినా అడిగే మనిషి ఈరోజు మౌనంగా వుండిపోయింది.

సారథి కాళ్ళు కడుక్కుని ఇవతలకి వస్తూంటే, చేయి కడుక్కోడానికి వస్తున్న తండ్రి రంగనాథం ''నేను చీకటితోటే ఫస్టబస్‌కి వెళుతున్నానురా అబ్బాయ్!'' అన్నాడు.

''ఎన్నిసార్లు చెబుతావ్?''

''మళ్ళీ ఆ వేళకి నువ్వు లేవవని- ఉగాదికల్లా వచ్చేస్తానులే''

''అలాగే!''

డైనింగ్ టేబుల్ మీద ఎంగిలి కంచాలు తీసి, నీళ్ళు జల్లి తుడుస్తోంది భానుమతి.

సారథి కుర్చీ టేబుల్ దగ్గరగా జరిపి కూర్చున్నాడు.

భానుమతి నిశ్శబ్దంగా రెండు కంచాల్లో వడ్డించింది!

కూరలో ఉప్పు డబ్బా వంపేసినట్లుంది!

చారు పళ్ళు పులిసిపోయేంత పులుపు!

పెరుగులో ఇన్ని నీళ్ళు పోసి, వేళ్ళతో తొరిపేసినట్లుంది- విరుగులా కనబడుతోంది!

''ఒంట్లో బావులేదా? అలా వున్నావేం?'' నాలుగు మెతుకులు కతికి కంచంలో చెయ్యి కడిగేసుకున్నాడు సారథి.

''అయ్యో ఖర్మ! ఈ ఇంట్లో నాగురించి పట్టించుకునేదెవరు? అందరికీ వేళకి అన్నీ అందిపోవాలి! నేనేలా వుంటే ఎవరికి పట్టింది?'' మజ్జిగ అన్నం సగంలో చెయ్యి కడిగేసుకుంది భానుమతి.

భారంగా నిట్టూర్చి బెడ్‌రూమ్‌లోకి నడిచాడు సారథి.

వంటింట్లోంచి భానుమతి గొణుగుతూనే వుంది! పెద్దగా గిన్నెల శబ్దం! తను కష్టం కలిగినప్పుడు సూటిగా ఏమీ చెప్పదు- ఇలా గొణుగుతూ, అరుస్తూ, రుసరుసలాడుతూ వుంటుంది! కోపకారణం కనుక్కోడానికి అధమపక్షం గంటో, గంటన్నర పడుతుంది! ముందు తను పూర్తిగా శాంతించాలి!

సారథి మంచం మీద వెల్లకిత్తులా పడుకుని పైన గరగరలాడుతూ తిరుగుతున్న ఫాన్‌ని చూస్తున్నాడు! పెళ్ళయిన కొత్తల్లో కొనుక్కున్న ఫాన్!

పిల్లలిద్దరూ హాల్లో మడతమంచాలు వాల్చుకుంటున్నారు!

రంగనాథం పక్కసందులో పచార్లు చేస్తున్నాడు.

''ఈ వయసులో కూడా ఎంత ఓపికో ఈయనకి!'' అనుకున్నాడు సారథి.

రంగనాథం దినచర్య అంతా ఒక పద్ధతి ప్రకారం సాగపలసిందే! ఆయన ఐదింటికే లేచి, మొహం కడుక్కుని వాకింగ్‌కి వెళ్ళిపోతాడు. ఆరున్నరకి తిరిగొచ్చేసరికి ఆవిర్లు కక్కే కాఫీ సిద్ధంగా వుండాలి, పంచదార లేకుండా! ఆయనకి నలభై ఏళ్ళప్పుడు డయాబిటీస్ బైట పడింది! ఆహారం విషయంలో కఠిన పత్యంగా వుంటాడాయన! యాభై దాటేసరికి భార్యపోయిన కొత్తల్లో బి.పి వున్నట్లు తెలిసింది. ఆయన కోసం చప్పిడి కూరలు విడిగా తీయాలి! పొరబాటున మొత్తం కూరలో ఉప్పు పడిపోతే ఒక్కపూటకి కూడా సర్దుకోడు! ''కూర అక్కర లేదమ్మా!'' అంటాడేగానీ నాలుగు ముక్కలు ఉప్పేసిన కూర వేసుకోడు.

''నా ఖర్మ ఈ ఇంట్లో నాకు సుఖపడే గీత ఎక్కడుంది?'' అని సణుక్కుంటూనే ఏ పొట్లకాయో, అరటికాయో తరుగుతుంది భానుమతి.

ప్రతి ఫస్ట్‌కీ ఠంచనుగా నెలకి సరిపడా మందులు, విటమిన్ క్యాప్సిల్స్ సంచీనిండా తెచ్చుకుంటాడు. రెండుపూటలా తొడలోకి స్వయంగా ఇన్సులిన్ ఇంజక్షన్ చేసుకుంటాడు. భానుమతి ఎంతపనిలో వున్నా ఆ టైంకి సిరంజ్ బాయిల్ చేసి ఇవ్వాల్సిందే!

''మీ నాన్నకి ఇంకా ఎందుకండీ జీవితం మీద ఈ కాపీర్యం'' అప్పుడప్పుడు విసిగిపోతూంటుంది భానుమతి.

ఆయన పెన్షన్ కమ్యూట్ చేసి ఎనభైవేలు లంచంగా ఇచ్చి కొడుకుకి కంపెనీలో ఉద్యోగం వేయించాడు! చదువంతగా అబ్బని సారథి ఏదో వ్యాపారంలో దిగి చేతులు కాల్చుకున్నాడు- ఆ సరికే భార్య, ఇద్దరాడ పిల్లలు! నెలనెలా ఖచ్చితమైన ఆదాయం లేని బతుకు! తండ్రి ఉద్యోగం వేయించాక సారథి జీవితం ఓ గాడిలో పడింది! ఆయనకి నెలకి దాదాపు మూడువేల పెన్షన్ వస్తుంది. పదిహేను వందలు కొడుకుకిచ్చి మిగతాది తన ఖర్చులకి, మందులకి వుంచుకుంటాడు!

ఎప్పుడైనా మనవరాళ్ళు కొత్త డ్రస్సుకో, ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళడానికో డబ్బులిమ్మంటే, ''మీ నాన్నని అడగండి! నేను తినే చప్పిడి తిండికి పదిహేను వందలిస్తున్నాను నెలకి! ఇక పైసా ఇచ్చేది లేదు!'' అంటాడు నిర్మొహమాటంగా.

''తాతయ్య పిసినారి!'' అంటుంది రమ.

''సెల్ఫిష్ తాతయ్య- ఎప్పుడూ తన గురించే చూసుకుంటాడు!'' అంటూ వంతపాడుతుంది రజని.

మనమరాళ్ళ మాటలు ఆయన అస్సలు పట్టించుకోడు!

''నిజంగా మామయ్యగారికి ఎంత స్వార్థం అండీ! ఎప్పుడూ.తన వాకింగ్, మందులు, తిండి- ఎవరి విషయం పట్టదు!'' అక్కసుగా అనేది భానుమతి.

పైకి అనకపోయినా మనసులోనే ''అక్షరాలా నిజం'' అనుకునేవాడు సారథి.

ఏవో ఆలోచనలలో వున్న సారథి, భానుమతి వచ్చి కిటికీ తలుపులు తీస్తూ వుంటే ఈ లోకంలోకి వచ్చాడు.

''ఒకసారి లేస్తే దుప్పట్లు దులుపుతాను!''

సారథి లేచి మంచాన్ని గది మధ్యలోకి లాగాడు. మంచం మీద దుప్పట్లు దులిపి, దిండ్లు సరిచేసింది భానుమతి!

సారథి గదిలో లైటార్పి, బెడ్‌లైట్ వేసేలోపల మంచం ఆ చివర గోడ వైపునకు తిరిగి పడుకుండిపోయింది భానుమతి.

పదినిముషాలు మౌనంగా పడుకుని, ''ఏంటీరోజు మూడీగా వున్నావ్?'' అంటూ భార్య వైపు తిరిగి భుజంమీద చేయివేశాడు సారథి.

కళ్ళు తెరుచుకుని చీకట్లోకి చూస్తున్న భానుమతి ఇటు తిరిగి భర్త చేయిని తన రెండు చేతుల్లోకి తీసుకుని బుగ్గకానించుకుంది.

''చెప్పవేం?'' చూపుడువేలితో ఆమె చెక్కిళ్ళమీద గీతలు గీస్తున్నాడు సారథి.

''మా పెద్దన్నయ్య కొడుకు శేఖరం ఒడుగుటండీ ఎల్లుండి!''

''ఉత్తరంగానీ వచ్చిందా''

''ఊహూ! ఎదురింటికి ఫోన్ చేసి చెప్పాడు అన్నయ్య! వాడు ఇంజనీరింగ్ చదువుకి మద్రాస్ వెళ్ళేముందు, ఒడుగు చేసి పంపిస్తే మంచిదని సిద్ధాంతిగారు చెప్పారుట! ఈ ముహూర్తం దాటితే ఈ ఏడాదిలో వాడికి నప్పేవి లేవుట! తప్పకుండా మన అందరినీ రమ్మన్నాడు''

''నాకు కుదరదు- మార్చి కదా!''

''మీకేమిటి, నాకే కుదరడం లేదు! పిల్లలకి మార్నింగ్ స్కూల్స్- ఏడింటికే పరిగెడతారు! వాళ్ళ వెనక వెళ్ళే మీరు- రాత్రి ఎనిమిది దాటితేగానీ ఇల్లు చేరడంలేదు! ఎనిమిదైతేనేగానీ పనిమనిషి రాదు! అందుకే ఓ నాలుగు రోజుల పాటు ఇల్లు చూసుకోమంటే మామగారు ససేమిరా కుదరదనేశారు! ఆయన ఆ ప్రకృతి వైద్యానికి రేపు ఫస్ట్‌బస్‌కి బెంగు

చారు వెళ్ళితీరాలట!'' మామగారి మీద పీకల దాకా కోపంగా వుంది భానుమతికి.

''ఈ వైద్యం కోసం నాలుగు నెలల ముందే ఎడ్వాన్స్ బుకింగ్ చేయించుకున్నాడు..వెళ్ళకపోతే ఆ డబ్బు దండగ! మళ్ళీ ఎప్పటికి అపాయింట్ మెంట్ దొరుకుతుందో, ఇప్పుడంటే చిన్నప్పటి ఫ్రెండ్ సాంబయ్యగారి కంపెనీ కూడా వుంది!'' తండ్రి వైపునుంచి సర్దబోయాడు సారథి!

ఆ మాటలకి గయ్యిమంటూ లేచింది భానుమతి. ''నాకు తెలియక అడుగుతాను ఇప్పుడు మీనాన్న ఆరోగ్యానికేం తక్కువ వచ్చిందట? ఇంకా ఎన్నేళ్ళు బతకాలిట? బతికి ఎవర్ని ఉద్ధరించాలిట?''

మళ్ళీ భార్యకి పూనకం రావడం చూసి హడలిపోయాడు సారథి. ''అప్పుడే పదకొండు దాటుతోంది. పడుకో! వేళదాటిపోతే మళ్ళీ నిద్రట్టలేదంటావ్!''

భానుమతి గొణుగుతూనే వుంది. ''ఈ అనంతపురం నుంచి ఆ శ్రీకాకుళం వెళ్ళిరావాలంటే ఎలా లేదన్నా నాలుగు రోజులవుతుంది. పోనీ పిల్లల్ని తీసుకెళ్ళిపోదాం అంటే వాళ్ళకి ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గరికొచ్చేశాయి! ఈ ముసలాయనకి ప్రకృతి వైద్యం పిచ్చి బాగా పట్టింది. ఆ బి.పి, షుగరూ తగ్గించేసుకుని టింగురంగామంటూ మళ్ళీ పెళ్ళికి సిద్ధం కావాలనేమో! అవతల నాకు అన్నయ్య పెట్టే చీర, హారతి పళ్ళెం అన్నీ పోతున్నాయి.''

భార్య సణుగుడు జోలపాటలా పనిచేసిందేమో, సారథి మరుక్షణం సన్నగా గురకపెట్టడం ఆరంభించాడు!

ఆ గురక వినగానే భర్త చెయ్యి పక్కకి తోసేసి, ఈ వైపునకు తిరిగిపోయింది భానుమతి!



నాలుగింటికల్లా అల్లారం పెట్టుకుని లేచి, స్నానం చేసేసి, కోడలు అందించిన కాఫీ తాగేసి, పెట్టె ...దాతో బెంగుళూరు ప్రయాణం అయి వెళ్ళిపోయాడు రంగ...థం.

''శేఖరం ఒడుగు చూసే యోగం నాకు ...రా, అన్నయ్యా'' అంటూ ఇంటి విషయాలన్నీ వివరిస... శ్రీకాకుళం ఉత్తరం వ్రాసి పడేసింది భానుమతి!

నాలుగురోజుల తరువాత కంపెనీ నుంచి వస్తు... ఒక ఉత్తరం భార్య చేతికి ఇచ్చాడు సారథి.

అది బెంగుళూరు నుంచి తండ్రి రంగనాథం వ్ర...ంది.

''అబ్బాయీ! మీరంతా కులాసాగా వున్నట్లు భా...స్తాను. నేను బాగానే వున్నాను. కోడలుకి నామీద కోపంగా ...వుంది ఎప్పుడూ నా గురించే నేను చూసుకుంటానని. మన... వాళ్ళు కూడా నన్ను సెల్ఫిష్ తాతయ్య అంటారు. అవును. ...ను నా ఆరోగ్యం ముఖ్యం. ఈ స్వార్థం వెనక మీకు నా అసలు ...ద్దేశం అర్థం కావాలనే ఈ ఉత్తరం. మీకు తెలుసు-నా... షుగరుంది. బి.పి వుంది. ఏమాత్రం ఆరోగ్యం నిర్లక్ష్యం ...సినా మంచాన పడతాను నేను. అప్పుడు కష్టపడాల్సిం... నేను కాదు..మీరు! నువ్వు పొద్దున్న వెళితే రాత్రికి వస్తావు. ...లు, మనవరాళ్ళు నన్ను లేపి కూర్చోబెట్టగలరా, అన్నీ ...ంచం మీద చేయగలరా? ఆ ఖర్చులకి నువ్వు తట్టుకోగలవా? ఆ రోజుల్లో అమ్మ తన అత్తగారికి పదేళ్ళు అన్నీ మంచం మీద చేసిందంటే ఆ కాలం, వాళ్ళ ఓపికలు వేరు. ఆప్యాయతలు వేరు! నా తాపత్రయం అంతా మంచాన పడి మిమ్మల్ని కష్టపెట్టకూడదనే! నెలకి ఐదొందలు రికరింగ్ డిపాజిట్ వేస్తూ నిన్ను నామినీగా ఎందుకు పెట్టాను? మనదేశంలో చావుకి కూడా పెళ్ళంత ఖర్చు! ఇద్దరాడపిల్లల తండ్రివైన నీకు ఆ ఖర్చు తప్పించడానికే ఈ నెలసరి పొదుపు! మీరు, నేను నెలకి పదిహేనువందలు దర్జాగా ఖర్చుపెట్టుకుంటున్నానని అనుకుంటున్నారు కదూ! నిజానికి వెయ్యి రూపాయలు నా మందులకి బొటాబొటీ సరిపోతాయి. ఐదొందలు బ్యాంకులో నా ఆఖరి ప్రయాణం కోసం దాస్తున్నాను. మన పక్కింటి పార్వతమ్మగారికి మనవలంటే తగని పిచ్చి! మందుల డబ్బులతో మనవలకి ఐస్‌క్రీమ్‌లు చాక్లేట్లు కొనేది! కొడుకు తెచ్చిచ్చిన స్వీట్లూ, పళ్ళూ కూడా దాచిపెట్టి, మనవల చేతుల్లోనే పెట్టేది. 'ముసలి ముండని-నాకెంత కావాలి?' అంటూ అందరూ తిన్నాక అడుగూ బొడుగూ మాడు చెక్కలు, మజ్జిగ వేసుకు తినేది! ఇప్పుడావిడ మంచాన పడింది! ఇంట్లో వాళ్ళంతా ఆవిడకి భూలోకంలోనే యమలోకం చూపిస్తున్నారు. వీపుమీద పుండు పడినా కదిపేవాళ్ళు లేరు. లేపి కూర్చోబెట్టేవాళ్ళు లేరు! కనీసం ఎలా వున్నావని పలకరించడానికి కూడా ఎవరికీ తీరుబడి లేదు. పైగా 'ఈ ముసలిది చచ్చేదెప్పుడు? పీడ విరగడ అయ్యేదెప్పుడు?' అంటూ రోజూ శాపనార్థాలు. అందుకే నా ఉద్దేశ్యంలో అరవై దాటిన వాళ్ళందరూ ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ వహించాలి! ఎవరికీ బరువు కాకుండా, మంచం పట్టి తనూ బాధపడకుండా, పండుటాకులా నిశ్శబ్దంగా రాలిపోవాలి! ఇంట్లో పెద్దల్ని సాగనంపడానికి ఇంట్లో వాళ్ళు 'అయ్యో' అనుకోవాలిగానీ 'హమ్మయ్య' అనుకోకూడదు. మన జాగ్రత్తలన్నీ మనం తీసుకోవాలి. ఆపై మన ఖర్మ. భగవంతుడి దయ. ఎదురుగా ఇవన్నీ చెప్పలేకే ఈ ఉత్తరం. నా మనసు కొద్దిగానయినా మీకు అర్థం అయిందని ఆశిస్తాను. ఉగాదినాటికి వచ్చేస్తాను. కోడలికి, మనుమరాళ్ళకు ఆశీస్సులు.

మీ నాన్న!''

ఉత్తరం పూర్తిగా చదివిన భానుమతి తలెత్తి సూటిగా భర్త కళ్ళల్లోకి చూడలేకపోయింది. ★

**మాచిరాజు కామేశ్వరరావు**